సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 29 : జూలై : 2025



ఖిల్లాపై విత్తన బంతులు

రామగిరి: సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామగిరి ఖిల్లాపై అల్లనేరేడు, సీతాఫలం, వేప, నిమ్మ, కూరగాయల విత్తన బంతులను చల్లారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



గోదావరిలో శ్రావణ స్నానాలు

ధర్మపురి: శ్రావణమాసం సోమవారం సందర్భంగా గోదావరి భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇళ్ల సర్వే పూర్తిచేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నరేందర్

రామగిరి(మంథని): రత్నాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈవో నరేందర్ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఇళ్లసర్వేతో పాటు ఓటరు జాబితా సవరణ పూర్తిచేయాలని సూచించారు. ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

స్థానిక యువతకు ప్లేస్‌మెంట్



ఈడీతో ధర్మరాజు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాల యువతకు శిక్షణ కమ్ ప్లేస్‌మెంట్ అవకాశం కల్పిస్తున్నామని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపీఈటీ) ప్రతినిధి ధర్మరాజు తెలిపారు. రామగుండంలోని ఎన్టీపీసీ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంతను సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మెషీన్ ఆపరేటర్ ప్లాస్టిక్ మోల్డింగ్ ప్రొఫెషనల్ అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులకు వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆసక్తి గలవారు ధర్మరాజును 94412 47207నంబరులోసంప్రదించండి.

భద్రత చర్యలు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): రాత్రనక, పగలనక పొలం పనులకు వెళ్లే రైతులు విద్యుత్ వినియోగం సందర్భంగా భద్రత చర్యలు పాటించి సురక్షితంగా ఉండాలని ట్రాన్స్‌కో డీఈ సూచించారు. కూనారం సోమవారం చేపట్టిన పొలంబాటలో ఆయన విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ మోటార్ల వద్ద స్టార్టర్ల కోసం ఇనుపవాటికి బదులు ప్లాస్టిక్ డబ్బాలే అమర్చుకోవాలని సూచించారు. ఏడీఈ మధుకర్, ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధత హక్కులు, కనీస సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా పరిధి యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ జోన్‌లో పనిచేస్తున్న కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా కాంట్రాక్ట్ కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. నాయకులు రాజేశం, సులోచన, సుగుణ, మల్లేశ్, శంకర్, నగేశ్, ఎల్లక్క, పద్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్తా



మెడల్‌తో విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: ఇటీవల మేడ్చల్‌లో నిర్వహించిన నేషనల్ ఓపెన్ టు ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఒకినోవా రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఇందులో జి.శాన్వి, ఎస్.స్వరాష, ఆర్.రాజా, ఎస్‌కే అభన్, ఇ.వర్షిత్, టి.రిషిత, మహా లక్ష్మి, కె.క్రాంతి, ఎం.అమృత్ సాయి వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. జాతీయ గ్రాండ్ చాంపియన్‌గా జి.సాన్వి నిలిచింది. వీరిని ఇన్‌స్ట్రక్టర్ మొండయ్య తదితరులు అభినందించారు.

బీజేపీదే బాధ్యత

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కాకుంటే ఆ పాపం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదే అవుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య హెచ్చరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పంపించిన రిజర్వేషన్ బిల్లును మోదీ ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదించాలన్నారు. వై.యాకయ్య, ముత్యంరావు, మహేశ్వరి, కుమారస్వామి, రామాచారి, బిక్షపతి, గణేశ్, శ్రీనివాస్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దందా

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- ఫిజీషియన్ శాంపిళ్లు, కాలంచెల్లిన మందుల అమ్మకాలు
- షాపుల్లో బినామీల దందా.. కానరాని ఫార్మసిస్టు
- అధికారుల నామమాత్రపు తనిఖీలు



సాక్షి పరిశోధన సాక్షి

- రామగుండానికి చెందిన సింగరేణి కార్మికుడి కాలికి ఇటీవల గాయమైంది. బాధితుడు ఓ మెడికల్ షాపుకు వెళ్లి ఆయింట్‌మెంట్ కావాలని అడిగి తీసుకుని ఇంటికి వెళ్లాడు. అతడి కుమారుడు ఆయింట్‌మెంట్‌ను పరిశీలించి శాంపిల్‌గా గుర్తించిండు. ఇదేవిషయంపై మెడికల్ షాపు నిర్వాహకుడిని ప్రశ్నించగా.. దానికి చెల్లించిన డబ్బు తిరిగి ఇచ్చేశాడు.

- కొన్ని సిరప్‌లలో మత్తు ప్రభావం కూడా ఉంటుంది. మాదక ద్రవ్యాలు వినియోగించే వారు ఈ సిరప్‌లు వాడుతున్నారు. డాక్టర్ చీటీపై రాసిస్తేనే వీటిని పేషెంట్‌కు విక్రయించాలి. మెడికల్ షాప్ నిర్వాహకులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నిషేధిత డ్రగ్స్, మత్తు కలిగించే సిరప్‌లనూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.

సాక్షి, పెద్దపల్లి: మీకు తల నిప్పి వస్తుందా? జ్వరం వస్తోందా? కడుపు, ఒళ్లు నొప్పులతో భరించలేన్నారా? నిద్ర పట్టడం లేదా? మీకు భయమేమీ లేదు. అనారోగ్య సమస్యలపై డాక్టర్‌ను సంప్రదించాల్సిన అవసరమే లేదు. సమస్య గురించి చెబితే చాలు.. మెడికల్ షాపుల్లో అన్నిరకాల మందులూ ఇస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా విక్రయిస్తారు. ఏ మందు ఎ వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్నిరోజులు వాడాలో కూడా వారే సూచిస్తారు. ఇలా జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. అధికారులు ఏదోఓసారి తనిఖీ చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేయడంతోనే చేతులు దులిపేసుకుంటున్నారు.

సేమ్ ఫార్ములా.. కంపెనీయే వేరు..

డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. ‘సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు.. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.’ అని చెబుతున్నారు. జిల్లాలో సుమారు 800 వరకు రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. రోజూ ప్రతీ చిన్న, పెద్ద దుకాణాల్లో రూ.5వేల నుంచి రూ.లక్ష వ్యాపారం సాగుతోంది. జిల్లాలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల అడ్రస్ లేదు. వారు ఎక్కడ ఉంటారో? ఏ ప్రాంతంలో తనిఖీ చేస్తున్నారో ఎవరికీ తెలియదు.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్టు–1940, ఫార్మసీ యాక్టు–1948 ప్రకారంగా బీ – ఫార్మసీ లేదా ఎం – ఫార్మసీ పూర్తిచేసిన వారే మెడికల్ షాపులు నిర్వహించాలి. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డు ప్రతులు, చిరునామా తదితర వివరాలు దరఖాస్తుతో జతచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలి. అనుమతి మంజూరైన తర్వాతే షాపులు నిర్వహించాలి. జిల్లాలో మెడికల్ షాపులు చాలామంది బినామీలే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితోనే దుకాణాలను నిర్వహించాలి.

పర్సంటేజీలు మాట్లాడుకొని..

జనరిక్, నాన్ జనరిక్ తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొనుగోలు చేసిన మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా విక్రయాలు చేస్తున్నారు. యాంటిబయాటిక్ మందులను డాక్టర్ల సూచనల మేరకు మాత్రమే ఇవ్వాలి. కానీ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ యాంటిబయాటిక్ మందులను ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అనవసరంగా యాంటిబయాటిక్ మందులు వాడిన వారు సైడ్ ఎఫెక్ట్‌లతో కొత్తరోగాల బారిన పడుతున్నారు. జిల్లాలో మెడికల్ దందాపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వివరణ కోరగా జిల్లాలో తరచూ మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని ఆయన తెలిపారు.

చాలామంది తక్కువ వేతనంతో యువకులకు పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేనివ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

మీ సేవకుడిని.. మీ సంక్షేమమే ధ్యేయం



గౌరెడ్డిపేటలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లిచ్చాం
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే అండగా ఉండాలి
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఎన్నుకున్న మీ అందరి సంక్షేమమే తన ధ్యేయంగా రోజూ 18 గంటల పాటు పనిచేస్తూ సేవకుడిగా ఉంటున్నానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గౌరెడ్డిపేట, ముత్తారంలో సోమవారం రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాడేలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులకే అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌తోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు మాదిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లయ్య, రాజేందర్, మస్రత్, మహేందర్, ఎడెల్లి శంకర్, నరేశ్, కొమ్ము శ్రీనివాస్, మల్లేశ్, మోహన్, నల్లగొండ కుమార్, రమేశ్, ఎద్దుకుమార్, శరత్ పాల్గొన్నారు.

మీర్జంపేటలో విచారణ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): రిటైర్డ్ సింగరేణి కార్మికుడు మూల రాజయ్య స్వగ్రామం మీర్జంపేటలో జిల్లా సంక్షేమాధికారులు సోమవారం విచారణ జరిపారు. ఆ వృద్ధుడి కొడుకులు పోషించడం లేదని, దీంతో బడి, గుడి, బస్టాండ్‌లో తలదాచుకుంటున్నాడంటూ బాధితుడి ఆవేదనపై వివిధ పత్రికలు సోమవారం కథనాలు ప్రచురించాయి. స్పందించిన జిల్లా సంక్షేమాధికారులు.. సోమవారం మీర్జంపేట గ్రామానికి తరలివెళ్లి రాజయ్య గురించి విచారణ జరిపారు. ఆయన బంధువులు ఎవరో మృతి చెందడంతో వేరే గ్రామానికి వెళ్లినట్లు స్థానికులు వారికి తెలియజేశారు. రాజయ్య ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆయనను తీసుకుని ఇద్దరు కుమారులు కలెక్టర్ కార్యాలయానికి రావాలని సూచించినట్లు సంక్షేమశాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి స్వర్ణలత తెలిపారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కరిస్తాం

- మంథని ఆర్డీవో సురేశ్



మాట్లాడుతున్న ఆర్డీవో సురేశ్

ముత్తారం(మంథని): భూభారతి దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిష్కరిస్తామని మంథని ఆర్డీవో సురేశ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ మూడో తేదీ నుంచి 20వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూభారతి దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలతో మూడు బృందాలుగా విభజించి సదస్సులు నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 1,478 దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మోకాపైకి వెళ్లి 608 దరఖాస్తులపై విచారణ చేశామని, మోకాపై పంచనామా చేసి ఉన్న రైతులను గుర్తించి, లేనివారికి నోటీసులు అందజేస్తున్నామన్నారు. భూభారతి దరఖాస్తుదారులు గ్రామాలకు అధికారులు వస్తే సహకరించాలని కోరారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షఫీ, ఆర్ఐ రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టిన చర్యలపై ఆయన సోమవారం ఆరా తీశారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జిల్లా వైద్యాధికారి, ఇతర వైద్యాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆస్పత్రుల్లో మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది గురించి ఆరా తీశారు. డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి మాట్లాడుతూ, వైద్యసేవలు, అనుసరిస్తున్న పద్ధతుల గురించి వివరించారు. రవీంద్ర నాయక్ మాట్లాడుతూ, నిబంధనల మేరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఫీజు వసూలు చేయాలన్నారు. ఆస్పత్రుల్లో టారిఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రోగ్రాం అధికారులు రాజమౌళి, వాణిశ్రీ, సుధాకర్ రెడ్డి, కిరణ్‌కుమార్ ఉన్నారు.

వైద్యసేవలపై ఆరా..

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, గర్రెపల్లి పీహెచ్‌సీని కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్రెపల్లి పీహెచ్‌సీ పరిధిలో నమోదైన డెంగీ కేసులు, నియంత్రణకు తీసుకున్న చర్యలపై సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలు భేష్గా ఉన్నాయని కితాబిచ్చారు.

టెన్త్ టాపర్లకు ప్రోత్సాహకం



టాపర్లకు సాయం అందిస్తున్న దాతలు

పెద్దపల్లిరూరల్: ఉన్న ఊరిపై మమకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అమెరికాలో స్థిరపడ్డ సోదరులు వావిలాల రవీందర్‌రావు, వెంకటరమణారావు ఏటా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.10వేల చొప్పున, 500కుపైగా మార్కులు సాధించిన మరో 9మందికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. సోమవారం కూడా నిట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. పంద్రాగస్టు, రిపబ్లిక్ డే సందర్భంగా క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందించడం అభినందనీయమని ఎంఈవో సురేంద్రకుమార్ అన్నారు.

శ్రావణ పూజలు



పండుగలను మోసుకొచ్చేది శ్రావణం. శివభక్తులకు ప్రీతికరమైన మాసం. భక్తి, మనసుతో భగవానుడిని స్మరిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఉపవాసాలు పాటించి, వ్రతాలు చేస్తే విశేష ఫలితాలు ఉంటాయని విశ్వాసం. అందుకే శ్రావణాన్ని సౌభాగ్యాన్ని ప్రసాదించే నెలగా మహిళలు కొలుస్తారు. ఈ సందర్భంగా శుభకార్యాలు, వివాహాలు, వ్యాపారాలు.. ఇలా మంచి పనులు అన్నీ కూడా శ్రావణంలో చేపడితే శుభాలు కలుగుతాయని నమ్మకం. శివపూజలకు విశిష్టమైన మాసం కావడంతో పెద్దపల్లిలోని శివాలయం, హనుమాన్ ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అవే ఈ చిత్రాలు..

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సత్వరమే స్పందించాలి

- సమస్యలకు పరిష్కార వేదిక ప్రజావాణి
- ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలి
- అడిషనల్ కలెక్టర్ వేణు ఆదేశాలు

- కలెక్టరేట్‌కు సమీపంలోని రైస్ మిల్లుల నుంచి వ్యర్థాలు వెలువడి దుర్వాసన వస్తోంది. పొగతో వాయువు కాలుష్యమవుతోంది. మా కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారు.
  – బృందావన్‌కాలనీవాసులు, పెద్దపల్లి

- పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరిఖనిలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూంలు నిర్వహిస్తున్నారు. వీటిని నియంత్రించేలా అధికారులను ఆదేశించాలి.
  – వంశీకృష్ణ, సామాజిక కార్యకర్త, గోదావరిఖని



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: ప్రజాసమస్యలకు పరిష్కార వేదిక ప్రజావాణి కార్యక్రమని, దీనిద్వారా అందిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు జిల్లాలోని పలు మండలాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. దరఖాస్తుల్లోని సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలన చేసి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రజావాణికి హాజరైన కొందరు ప్రజలను పలుకరించగా..

గృహజ్యోతి వర్తింపజేయాలి



మా ఇంటికి గృహజ్యోతి వర్తింపజేయాలని దరఖాస్తు చేసుకున్నా. అన్ని అర్హతలున్న నాకు పథకం వర్తింపజేయడం లేదు. అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలి.

– అరికిల్ల సత్తయ్య, బొంపల్లి

కూతురుకు ఉద్యోగం ఇప్పించండి



నా భర్త వాసు రాఘవాపూర్‌లో విద్యుత్ హెల్పర్‌గా పనిచేస్తూ మరణించాడు. ఆ ఉద్యోగాన్ని నా కొడుక్కు ఇచ్చారు. ఆయన కూడా 9 నెలల క్రితం కరెంట్ షాక్‌తో చనిపోయాడు. నా కూతురుకు ఉద్యోగం ఇప్పించండి.

– గుండ శారద, రాఘవాపూర్

పింఛన్ మంజూరు చేయండి



నాకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్న. ఆఫీసుల చుట్టూ తిరిగిన. అన్ని అర్హతలు ఉన్న నాకు పింఛన్ మంజూరు చేయడం లేదు. వృద్ధాప్య పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

– బత్తిని లక్ష్మయ్య, చందపల్లి

ఏ ఆధారమూ లేదు



కొంతకాలం క్రితం మా నాన్న చనిపోయాడు. ఇప్పుడు నాకు ఏ ఆధారం లేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. అన్నిఅర్హతలున్న నాకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్న.

– బరిపట్ల భారతి, గోదావరిఖని

ట్రై సైకిల్ ఇప్పించండి



నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడిని నేను. నా అవసరాలు తీర్చుకునేందుకు మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ ఇప్పించాలి. ఎటైనా వచ్చిపోయి వచ్చేందుకు వీలుగా ఉంటుంది. అధికారులు చొరవ చూపి ట్రైసైకిల్ మంజూరయ్యేలా చూడాలి.

– అఫ్సర్ హుస్సేన్, ఎల్కలపల్లిగేట్

భూమి పట్టా ఇప్పించండి



ఓదెల మండలం కొలనూర్ గ్రామ శివారులో ఉన్న పదిహేనున్నర గుంటల భూమిని కొనుగోలు చేసుకున్న. 1982 నుంచి మోకాపై ఉన్న. కానీ ఆ భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం రాలేదు. నాకు పాసుపుస్తకం ఇప్పించాలి.

– పల్లె లచ్చమ్మ, కొలనూర్

ఆటలతోపాటే సంగీతం

- జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక
- ఇప్పటికే స్కూళ్లకు చేరిన వాయిద్యాలు
- విద్యార్థులు సత్ఫలితాలు సాధించడమే లక్ష్యం



స్కూళ్లకు చేరిన వాయిద్యాలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆటాపాటలు, సంగీతం నేర్చుకోవడం ద్వారా చదువులో సత్ఫలితాలు సాధిస్తారనే ఆశయంతో సర్కారు సంగీత వాయిద్యాలను సరఫరా చేస్తోంది. ఈమేరకు జిల్లాలో ఇప్పటివరకు 16 ప్రభుత్వ పాఠశాలలను పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేశారు.

స్కూళ్లకు చేరిన వాయిద్యాలు..

జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ (పీఎంశ్రీ) ఎంపిక చేసిన 16 సర్కారు స్కూళ్లలో సంగీత తరగతులు నిర్వహించడానికి ఇప్పటికే సంగీత వాయిద్యాలను సరఫరా చేశారు. ఇందులో వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం, బ్యాండ్ ఉన్నాయి.

ఆరో తరగతి నుంచే..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ,రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆసక్తిగల విద్యార్థులకు సంగీతం నేర్పిస్తారు. ఇందులో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు ఉంటారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించాలనే లక్ష్యం మేరకు పాఠశాల దశ నుంచే కళారంగంలో రాణించేందుకు సంగీతం నేర్పిస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

త్వరలో ట్రెయినర్ల నియామకం

సంగీత పాఠాలు బోధించే ఒక్కో పాఠశాలకు ఒక్కో ట్రెయినర్‌ను కాంట్రాక్టు పద్ధతిన నియమించాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం అనుభవం కలిగిన వారికి, రిటైర్డ్ ఆర్మీ సైనికులకు ప్రాధాన్యం ఇస్తారని తెలిసింది.

ట్రెయినర్లను ఎంపిక చేస్తాం

పీఎంశ్రీ పథకం ద్వారా విద్యార్థులకు సంగీతం నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు అవసరమైన సంగీత వాయిద్యాలు పాఠశాలలకు చేరాయి. శిక్షణ ఇచ్చేవారి ఎంపికే మిగిలి ఉంది.

– మాధవి, డీఈవో

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్‌రెడ్డి

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పబ్బతి చంద్రయ్య (40) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఐదునెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య ప్రమీల ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అమెరికాలో సింగరేణి కార్మికుడి మృతి

- ఇండియాకు శవాన్ని తీసుకొచ్చే యత్నంలో బంధువులు


పెరక ప్రకాశ్ (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–2లో పని చేస్తు గోదావరిఖనిలో పవర్ హౌస్ కాలనీలో నివాసముంటున్న పెరక ప్రకాశ్(54) అమెరికాలో ఇటీవల మృతి చెందాడు. ఆయన కూతురు అమెరికాలోని అస్టిన్ నగరంలో ఉండగా.. అక్కడికి వెళ్లి మరణించాడు. మృతదేహాన్ని ఇండియాకు పంపించడానికి అక్కడి బంధువులు గోఫండ్‌మీ పేజీ ఏర్పాటు చేసి సాయంకోసం ఎదురుచూస్తున్నారు. అక్కడి తానా ప్రతినిధులతో మాట్లాడి శవాన్ని గోదావరిఖనికి తీసుకురావాలనే యోచనలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉండగా, చిన్న కూతురి వద్దకు వెళ్లిన సమయంలో ఈసంఘటన జరిగింది.

గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు

వెల్గటూర్: గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్ తెలిపారు. మండలంలోని మొక్కట్రావు పేట శివారులో పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బాలుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికింది. బాలుడిది ముత్తునూర్ గ్రామంగా గుర్తించారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురిపై..

మెట్‌పల్లి: మెట్‌పల్లి క్లబ్ సొసైటీ స్థల విక్రయ వ్యవహారంలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. క్లబ్ ఆస్తులను గుట్టుగా విక్రయించి మోసానికి పాల్పడుతున్నారని దొంతుల వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధ్యక్షుడు చెట్లపల్లి నరేందర్‌గౌడ్‌వ గంగుల వివేక్, వేముల కిషన్, దొంతుల సుధాకర్, వేముగంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీపైనే ఆశలు

- భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టులోకి నీరు
- 23.866 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- నీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద చేరుతోంది. ఆయకట్టుకు విడుదల చేసేస్థాయిలో ప్రాజెక్టు నీటిమట్టం పెరగకపోవడంతో, నీటి విడుదలపై సందిగ్ధం నెలకొంది. మొన్నటి వరకు వర్షాలు లేక, పంటలు ఎండిపోతుండటంతో నీరు విడుదల చేయాలని జిల్లాలోని కథలాపూర్, మెట్‌పల్లి రైతులు ఆందోళనకు దిగారు.

➡ ఎగువప్రాంతాల్లో వర్షాలు అంతంతే

ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పెద్దగా లేకపోవడంతో నీరు చేరడం లేదు. రెండేళ్లలో జూలై నెలలోనే ప్రాజెక్టు నిండింది. జిల్లా ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరు ఇచ్చారు. ప్రాజెక్టుకు చెందిన కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువలకే కాకుండా వరదకాలువకు సైతం పలుమార్లు నీటిని వదిలారు. ప్రాజెక్టు నిండిన తర్వాత ఐదారుసార్లు గేట్లు ఎత్తి వరదను గోదావరిలోకి వదిలారు.

➡ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు

జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇందులో వరి 3 లక్షల ఎకరాల్లో సాగుచేసే అవకాశముంది. వరికి సాగునీటి అవసరం ఎక్కువ. ప్రస్తుతం వ్యవసాయ బావుల్లో ఉన్న నీటితోనే వరి నాట్లు వేస్తున్నారు. ప్రాజెక్టు నిండుతుందనే ఆశతో రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పుడే వరద వచ్చే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల్లో ఉన్న నీరు సైతం ప్రధాన పొలం దున్నేందుకు సరిపోవడం లేదని చెపుతున్నారు. లక్షన్నర ఎకరాల్లో సాగయ్యే మొక్కజొన్న, పసుపు పంటలకు వర్షం నీరు సరిపోతుంది. తప్పని పరిస్థితుల్లో డ్రిప్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు.

➡ ప్రాజెక్టులో 23.866 టీఎంసీలు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1070.30 అడుగుల నీరుంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీ(గతంలో 90.3 టీఎంసీ)లకు ప్రస్తుతం 23.866 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి 13.045 టీఎంసీల నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సగటున ప్రాజెక్టులోకి 10,484 క్యూసెక్కుల నీరు చేరుతోంది. గతేడాది ఈ సమయానికి ప్రాజెక్టు నీటి మట్టం 1073.60 అడుగులు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 29.933 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 622 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో వెళ్తోంది.కాగా.. కథలాపూర్, మెట్‌పల్లి ప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని ఆందోళన చేస్తున్నారు.

ఎదురుచూస్తున్నాం



ఎస్సారెస్పీ ప్రాజెక్టు జిల్లాకు వరప్రదాయినీ. ఈ ప్రాజెక్టు ద్వారా జగిత్యాల జిల్లాకే ఎక్కువ నీరు అందుతుంది. ప్రాజెక్టు నీరు రాకపోతే పంటలు సాగుచేయడం కష్టం. చాలామంది వరినాట్లు వేసి ఎస్సారెస్పీ నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

– వేముల కరుణాకర్, ధర్మపురి

ప్రాజెక్టు నిండాలి



ఖరీఫ్ సీజన్‌కు ఆన్, ఆఫ్ పద్ధతిలో ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి. ఇప్పటి వరకు వ్యవసాయ బావిలో ఉన్న నీటితో నాట్లు వేసుకున్నాం. బావుల్లో సరిపోయేంత నీరు లేదు. ప్రాజెక్టు తొందరగా నిండి, వానాకాలం, యాసంగి పంటలకు నీరు అందించాలి.

– నక్కల తిరుపతి రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి



కోడె మొక్కులు... సత్యనారాయణ వ్రతాలు

వేములవాడ: శ్రావణమాసం సోమవారం కావడంతో వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు 45 వేల మంది భక్తులు తరలివచ్చారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో సత్యనారాయణ వ్రతాలు, కల్యాణాల మొక్కులు చెల్లించుకున్నారు.




రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన ఆయన కరీంనగర్–జగిత్యాల విస్తరణ పనులతో పాటు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్‌ఐఎఫ్) మంజూరు అంశాలపై చర్చించారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు ఫోర్‌లేన్ విస్తరణకు ఎన్నికలకు ముందే కేంద్రం రూ. 2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్) ను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్‌ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జితోపాటు గన్నేరువరం మండలం గుండ్లపల్లి–పొత్తూర్ రోడ్డు విస్తరణ పనులు, చందుర్తి నుంచి మోత్కురావుపేట వరకు వంతెనల నిర్మాణ పనులు, కిష్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణం, శంకరపట్నం మండలం అర్కండ్ల (గ్రామం) నుంచి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలు వపై హై లెవల్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు వీటిలో ఉన్నాయి. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే సీఆర్‌ఐఎఫ్ నిధులు విడుదలపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సరస్వతీ పుత్రునికి అందిన లక్ష్మీకటాక్షం

- ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన పీఏ మురళీధర్ రెడ్డి
- స్పందించి సాయం చేసిన నేతలు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: కూలిపనులు చేసుకుంటూ బతికే మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ–శంకర్ దంపతుల కొడుకు మహేశ్ గత ఏప్రిల్‌లో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 453 (ఎస్సీ విభాగంలో 17)వ ర్యాంకు సాధించాడు. తమిళనాడులోని తిరుచిరాపల్లి ఎన్‌ఐటీలో ఆర్కిటెక్చర్ సీటు దక్కించుకున్నాడు. ఫీజుకట్టలేని పరిస్థిలో తల్లిదండ్రులు ఉండడంతో మహేశ్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ పీఏ మురళీధర్ రెడ్డి విద్యార్థికి ఎలాగైనా సహాయం చేయాలని తలిచి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారుల సహకారంతో రూ.3.30 లక్షలు సమీకరించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థి మహేశ్‌కు అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో పేదలకు సాయం చేయాలని, విద్యార్థికి ఆర్థిక సాయం చేసిన దాతలు అభినందించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులికృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఎస్ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, బండారి రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, మోరపల్లి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. నీటిబకెట్‌లో పడి..


సాన్వీ(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): సరదాగా ఆడుకుంటూ వెళ్లిన చిన్నారి గుండు సాన్వీ(21నెలలు) నీటిబకెట్‌లో పడి చనిపోయింది. పెద్దపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీశ్ – రవళి దంపతులు. వీరికి ఒక మారుడు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు పెద్దవాడు, కూతురు సాన్వీ ఇంట్లో సందడిచేస్తూ ఉండేది. ఈక్రమంలోనే ఈనెల 27న రాత్రి 7.00 గంటల సమయంలో ఇంట్లో ఆడుకుంటోంది. చిన్నారి తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నయ్యారు. అయితే, ఇంట్లో ఆడుకుంటూ క్రమంగా బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే ఆడుకుంటూ సమీంలోని నీటి బకెట్ వద్దకు చేరుకుంది. అక్కడ నీటిని చేతితో తాకేందుకు యత్నించగా బకెట్‌లో తలకిందులుగా పడిపోయింది. ఆ వెంటనే గమనించిన చిన్నారి పెద్దనాన్న నరేశ్ కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

మాతృమూర్తుల కళ్లు సజీవం


సుందరమ్మ కార్నియాలను దానం చేస్తున్న కుటుంబసభ్యులు


రాజమ్మ నేత్రాలు సేకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

- చనిపోతూ మరికొందరికి చూపునిచ్చిన ఇద్దరు మహిళలు


భీమవరం సుందరమ్మ(ఫైల్)

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు చెందిన ఇద్దరు మాతృమూర్తులు చనిపోతూ మరికొందరికి చూపునిచ్చారు. వివరాలు.. సుల్తానాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన భీమవరపు సుందరమ్మ(86) వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సోమవారం ఇంట్లోనే చనిపోయింది. ఆమె భర్త మురహరిరావు స్వాతంత్ర్య సమరయోధుడు. అయితే, సుందరమ్మ నేత్రాలు దానం చేస్తే మరో ఇద్దరికి చూపువస్తుందని సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు నూక రమేశ్.. ఆమె కుటుంబసభ్యులను ఒప్పించారు. దీంతో ఆ మాతృమూర్తి కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు ఇందుకు అంగీకరించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో కార్నియాలు సేకరించారు. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, నూక రమేశ్, భీష్మాచారి, కేఎస్ వాసు తదితరులు కుటుంబసభ్యులను అభినందించారు.

మాజీ ఎంపీపీ రాజమ్మ కళ్లు దానం..

కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ఈద రాజమ్మ(65) ఆదివారం రాత్రి చనిపోయారు. దీంతో సదాశివ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఆమె కుటుంబ సభ్యులను కలిసి కళ్లు దానం చేయాలని విన్నవించారు. దీంతో వారు అంగీకరించగా, టెక్నీషియన్ ఆమె కార్నియాలు సేకరించారు. మృతురాలు భర్త, మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి, కుమారుడు రఘోత్తంరెడ్డి, కూతురు మాధవి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ రాజమల్లు, మాజీ ఎంపీపీ బాలే మల్లేశ్వరి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముదిగొండ అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్


అమరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం సమరశీల ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మాట్లాడారు. ముదిగొండలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై తుపాకీ తూటాల వర్షం కురిపించి ఏడుగురిని కాల్చి చంపిందన్నారు. పాలకులు మారినా పేదల జీవితంలో మార్పు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చే ముందు అందరికీ ఇళ్లు ఇస్తామని హామీలను విస్మరించిందని, ఇంటి స్థలం కోసం పోరాటం చేసిన పేదలపై కేసులు పెట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇంటి స్థలం ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాసురెడ్డి, సుంకరి సంపత్, భూతం సారంగపాణి, వడ్ల రాజు, కవ్వంపల్లి అజయ్, మాతంగి శంకర్, రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొంటే బీమా


ఇఫ్కో కంపెనీ యూరియా బస్తాలు


దుర్శేడ్ సొసైటీలో నానో యూరియా సీసాలస్టాక్


నానో యూరియా సీసాలతో డీలర్

- ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అమలు
- రూ.2లక్షల వరకు ఆర్థికసాయం

కరీంనగర్‌రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతోపాటు ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు కొన్న రైతులకు కొత్తగా బీమా సౌకర్యం కల్పించారు. ఇఫ్కో ఎరువుల కంపెనీ ఉచిత సంకటహరణ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఎరువులు కొన్న ప్రతీ రైతుకు ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేస్తారు. ఇటీవల కురిసిన వర్షాలతో వానాకాలం సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనుల నిమిత్తం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో రైతులు ప్రమాదాల బారిన పడితే కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు ప్రమాదాల బారిన పడితే కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఇఫ్కో ఎరువుల కంపెనీ బీమా సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఎరువులు కొంటే సరిపోతుంది.

రసీదు భద్రపరుచుకోవాలి

సహకార సంఘాలు, డీలర్ల వద్ద ఇఫ్కో కంపెనీ ఉత్పత్తి చేసిన ఎరువులు కొనుగోలు చేసినపుడు రసీదులను తప్పనిసరిగా తీసుకుని భద్రపరుచుకోవాలి. రైతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం, నీటిలో మునిగిపోవడం, పాముకాటు, ట్రాక్టర్, హార్వెస్టర్ తదితర యంత్రాలతో ప్రమాదానికి గురైతే బీమా పరిహారం పొందే అవకాశముంది. రసీదుతోపాటు రైతు మృతికి సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతే ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్టు, మరణ ధ్రువీకరణ పత్రం ఇఫ్కో కంపెనీ ప్రతినిధులకు రెండునెలల్లోపు సమర్పించాల్సి ఉంటుంది.

రూ.2 లక్షల వరకు..

సహకార సంఘాలతోపాటు ప్రైవేట్ డీలర్ల వద్ద ఇఫ్కో ఎరువులు కొన్న రైతులందరికీ ప్రమాదబీమా సౌకర్యం కల్పించారు. రైతు కొనుగోలు చేసిన ఒక బస్తా, నానో ఎరువు బాటిల్‌పై రూ.10వేల బీమా, 20 బస్తాలు లేదా నానో యూరియా సీసాలు కొనుగోలు చేస్తే రూ.2 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఎరువులు కొన్న నెల తర్వాత నుంచి ఏడాది వరకు బీమా సౌకర్యముంటుంది. రైతు మృతిచెందితే వందశాతం, రెండు అవయవాలు కోల్పోతే 50శాతం, ఒక అవయం కోల్పోతే 25శాతం బీమా పరిహారం చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఇఫ్కో ఎరువులు కొన్న రైతులందరికీ బీమా సౌకర్యముంటుంది. ఎరువులు కొన్న రసీదులను భద్రపరుచుకోవాలి. గతంలో సైతం బీమా సౌకర్యముండగా పరిహారం తక్కువగా ఉండేది. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి పరిహారం పెంచిన దృష్ట్యా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.బాలాజీ, ఇఫ్కో కంపెనీ జిల్లా మేనేజర్

గోశాల.. గోస తీరేనా.!

- మర్రిపల్లిలో 50 ఎకరాల్లో గోశాల
- అనుమతుల రాగానే నిర్మాణ పనులు
- కేబినెట్ ఆమోదంతో హర్షంవ్యక్తం చేస్తున్న భక్తులు


తిప్పాపూర్‌లోని గోశాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. రాష్ట్రంలోని గోశాలల్లో అధునాతనమైన గోశాలలను నిర్మించాలని ఇందుకు 21 ప్రాంతాలను ఎంపికచేసింది. అందులో భాగంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న గోశాలను 50 ఎకరాల స్థలంలో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోవుల పోషణ, సంరక్షణకు పశుసంవర్ధక, రెవెన్యూ, దేవాదాయ శాఖల భూముల్లో ఈ గోశాలను నిర్మించాలని ఇంతకుముందు జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాజన్న ఆలయ గోశాల కోసం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని 748 సర్వేనంబర్‌లో 50 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పటికే గుర్తించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఈ ప్రాంతంలో గోశాల నిర్మించనున్నారు.

ఏటా కోట్లాది రూపాయల ఆదాయం..

రాజన్నకు భక్తులు మొక్కుబడిగా కోడెలు సమర్పిస్తారు. కొందరు ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకుంటారు. కోడె మొక్కులతో ఏటా ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. తిప్పాపూర్‌లో మూడెకరాల స్థలంలో దాదాపు 400 కోడెలు ఉంటాయి. ఆలయంలో భక్తుల మొక్కు చెల్లింపుల కోసం సమీపంలోని గోశాల వద్ద కొన్ని కోడెలు సిద్ధంగా ఉంచుతారు. వీటి సంరక్షణ కోసం ఏఈవో స్థాయి అధికారి పర్యవేక్షణలో కోడెల బాగోగులు చూసుకుంటారు. భక్తులు పశుగ్రాసం వితరణగా అందిస్తారు. ఇటీవల వరుసగా కోడెలు మృత్యువాత పడటంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. రాజన్న గోశాల కోసం ప్రత్యేకంగా అధునాతనమైన గోశాల నిర్మించాలని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ గోశాల కోసం 50 ఎకరాల స్థలం గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మర్రిపల్లిని 748 ప్రభుత్వ స్థలాన్ని 50 ఎకరాలుగా గుర్తించి అందులో హద్దులు ఏర్పాటు చేశారు.

కోడెలను సంరక్షించాలి



భక్తులు సమర్పించే నిజ కోడెలు గోశాలలోనే ఉంచి సంరక్షించాలి. కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి కోడెల సంరక్షణ సమస్య కాదు. వాటి కోసం ప్రత్యేక నిధులు, సిబ్బందిని కేటాయించి వాటి బాగోగులు చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది.

– గడప కిశోర్‌రావు, విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి, కరీంనగర్ జిల్లా

50 ఎకరాల్లో నిర్మాణం



రాజన్న ఆలయానికి ఏటా రూ.123 కోట్ల 76 లక్షల ఆదాయం వస్తుంది. దాదాపు 68 శాతం కోడెమొక్కుల ద్వారా సమకూరుతుంది. కోడెల సంరక్షణకు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మర్రిపల్లి శివారులో గోశాల కోసం 50 ఎకరాల్లో నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

– చిలుక రమేశ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి